క్లుప్తంగా

క్షీరారామలింగేశ్వరస్వామిని దర్శించిన ఉప కమిషనర్



విజయరాజుకు ఆశీర్వచనం పలుకుతున్న అర్చకులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామిని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్ ఎం.విజయరాజు దర్శించుకున్నారు. సోమవారం ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు వేద ఆశీర్వచనం పలికారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో సూపరింటెండెంట్ తోట సుబ్రహ్మణ్యం, భీమవరం డివిజన్ ఇన్‌స్పెక్టర్ వర్ధినీడి వెంకటేశ్వరరావు, పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.తిమ్మరాజు ఉన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవాంగ సంక్షేమ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న దృశ్యం

నరసాపురం: నరసాపురం శ్రీ చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం వీవర్స్ కాలనీలో జరిగిన సంఘ సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బళ్ల రమేష్ కుమార్, దొంట్టి సత్యనారాయణ ఎన్నికయ్యారు. కోశాధికారిగా బళ్ల భవానీ ప్రసాద్, గౌరవాధ్యక్షునిగా పట్టా నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కనకం ప్రసాద్‌తో పాటు మరో 24 మందితో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పనిచేయాలని తీర్మానం చేశారు. సమావేశంలో సంఘ పెద్దలు వి.మధుసూదనరావు, గోరు లింగరాజు, ద్వారా పార్థసారథి ఊటుకూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చదువును నిర్లక్ష్యం చేయొద్దు

నరసాపురం రూరల్: విద్యార్థి దశ నుంచి చదువును అలవర్చుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు సూచించారు. అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నరసాపురం మండలం యర్రంశెట్టివారి పాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జడ్జి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు, ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాస్, న్యాయవాదులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సమీక్ష

పాలకొల్లు అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ఈ నెల 24 నుంచి జరిగే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం విజయవంతానికి అధికారులు పూర్తి స్థాయిలో పనిచేయాలని తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంకల్ప యాత్రలో భాగంగా ప్రతి గ్రామంలో బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు పథకాలను ప్రజలకు వివరిస్తారన్నారు. సమావేశంలో ఏడీఏ అద్దాల పార్వతి, కో ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.విజయశ్రీ,, ఏవో ఎం.జాన్సన్, పంచాయతీ రాజ్ ఏఈ కె.శామ్యూల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బీవీ రమణ, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఏఈ కె.శ్రీనివాస్, ఏపీఎం కె.జ్యోతిరాణి పాల్గొన్నారు.

త్రిలింగ క్షేత్రాల్లో కార్తీక సందడి

పెనుమంట్ర: కార్తీక మాసం తొలి సోమవారం పురస్కరించుకుని దక్షిణ కాశీగా పేరుగాంచి, త్రిలింగ క్షేత్రాలుగా ప్రసిద్ధికెక్కిన జుత్తిగలోని శ్రీ ఉమావాసుకి రవి సోమేశ్వరస్వామి, నత్తా రామేశ్వరంలోని శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి, మల్లిపూడిలోని శ్రీ ఉమా అగస్త్యేశ్వర స్వామి ఆలయాలను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఏకకాలంలో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో స్వామివార్లకు అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. జుత్తిగ సర్పంచ్ తమనంపూడి వీర్రెడ్డి, ట్రస్టు బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాయు త్రిలింగ క్షేత్రాల్లో..

పాలకొల్లు అర్బన్: వాయు త్రిలింగ క్షేత్రాలుగా ప్రసిద్ధి చెందిన శివదేవునిచిక్కాలలోని శ్రీ పార్వతి సమేత శ్రీ శివదేవస్వామి, అలాగే దిగమర్రులోని శ్రీ ఉమా నరేంద్రస్వామి ఆలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అమ్మవార్లకు కుంకుమార్చన చేశారు. ఆలయ అర్చకులు ర్యాలి శివరామకృష్ణ ప్రసాద్, ర్యాలి శివాజీ, చేబ్రోలు శ్రీనివాస రామమూర్తి పూజలు చేశారు.

అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం

నరసాపురం: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలంటే మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. “ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..” కార్యక్రమాన్ని సోమవారం పట్టణంలోని వీవర్స్ కాలనీ సచివాలయం పరిధిలోని 25,26,27 వార్డుల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ముదునూరి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు ఉచితంగా చదవాలన్నా, ఏదైన రోగమొస్తే ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యం అందాలన్నా, పింఛన్ ఠంచన్‌గా 1వ తేదీన వలంటీర్ మన ఇంటికి వచ్చి ఇవ్వాలన్నా, డ్వాక్రా రుణాలు అందాలన్నా, అమ్మ ఒడి డబ్బులు పడాలన్నా, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలని చెప్పారు. రాష్ట్రంలో మహిళలు, వృద్ధులు, రైతులు, విద్యార్థులు ఇలా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున అమలు చేస్తున్న ముఖ్యమంత్రి దేశంలో ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు పూర్తిగా అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందని చెప్పారు.

ప్రతిపక్షాల కుట్ర..

పేదోళ్లకు మంచి జరగకూడదని ప్రతిపక్షాలు అన్నీ ఏకమై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కుట్రలు చేస్తున్నాయని ముదునూరి తెలిపారు. జగన్ ఊరుకునే డబ్బులు పంచిపెడుతున్నాడంటూ నిందలు వేస్తున్నారని అన్నారు. పేదోళ్లకు మంచి జరిగితే ప్రతిపక్షాలకు గిట్టదని చెప్పారు. జగన్ మన భవిష్యత్ అని, మళ్లీ అందుకే జగన్ ముఖ్యమంత్రి కావాలన్నారు. నరసాపురంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వశిష్ట వంతెన, బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్, ఆక్వా యూనివర్సిటీ వంటి ప్రాజెక్ట్‌లు ఈ ప్రభుత్వంలో మంజూరు అయ్యాయన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తికావాలంటే జగన్ అవసరమని వివరించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో



నరసాపురం: వీవర్స్ కాలనీలో జగనన్న భూ హక్కు పట్టాలు పంపిణీ చేస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

రూ.1,500 కోట్లు సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ యడ్ల తాతాజీ, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు బూసరపు జయ, కౌన్సిలర్లు యర్రా శ్రీను, గోరు సత్తిబాబు, జిల్లెళ్ల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమం అందాలంటే సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలి

పాలకొల్లు అర్బన్: పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి అవసరమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు గ్రామ సచివాలయం-1 ఆవరణలో సోమవారం “వై ఏపీ నీడ్స్ జగన్” కార్యక్రమానికి ఆయన హాజరై సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ గ్రామంలో వ్యక్తిగతంగా 3,723 మంది సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారన్నారు. ప్రత్యక్ష నగదు బదిలీ పథకంలో భాగంగా రూ.11,59,49,384, పరోక్ష ప్రయోజనాల ద్వారా రూ.2,57,91,814తో పాటు గ్రామంలో వివిధ అభివృద్ధి పథకాల ద్వారా రూ.5,57,40,447 లబ్ధి పొందారన్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన గ్రామ సర్పంచ్ చొప్పల రజని అధ్యక్షత వహించి మాట్లాడుతూ తన కుమార్తెకు అమ్మఒడి పథకం కింద ప్రయోజనం పొందానన్నారు. అలాగే వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ పథకాల ద్వారా లబ్ధి పొందినట్లు వివరించారు. జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్ బాబు, నోడల్ అధికారి కె.మాణిక్య వైభవతి, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, గ్రామ ఉప సర్పంచ్ కూనపరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు), పార్టీ మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరావు, మండల సచివాలయ కన్వీనర్ పార్శి వెంకటరత్నం, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కర్రి జోగయ్య, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు ఏనుగుపల్లి చంద్రశేఖర్, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు, మండల కో ఆప్షన్ సభ్యులు తండా ఇస్సాక్‌రాజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి సూర్యనారాయణ, పార్టీ నాయకులు ఆరేపల్లి సింహాద్రి, మడికి విక్రమ్, రౌతు కృష్ణ, రావూరి చిన్న, దేవ ప్రసాద్, తమ్మా కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీ సంక్షేమం, అభివృద్ధి సారథి సీఎం జగనన్నే

పోడూరు: రాష్ట్ర సంక్షేమ, అభివృద్ధి సారథి సీఎం జగనన్నేనని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లి నాగన్న అన్నారు. గుమ్మలూరు సచివాలయం-1 పరిధిలో సోమవారం గ్రామ సర్పంచ్ గొట్టుముక్కల సోనియా రమేష్ అధ్యక్షతన “వై ఏపీ నీడ్స్ జగన్” కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలతో డిస్‌ప్లే ఏర్పాటు చేశారు. పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నాగన్న మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అమలు చేశారని, మాట ఇస్తే మడమ తిప్పని ఏకైక ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, సర్పంచ్ సోనియా రమేష్‌లు మాట్లాడుతూ పార్టీలు, కులమతాలకు, వర్గాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు వర్తింపచేసి సంక్షేమ క్యాలెండర్‌లోని తేదీల్లో లబ్ధిదారుల ఖాతాల్లోకి పథకాల సొమ్ము జమ చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. రైతులు, మహిళలు, కార్మికులు, యువతతో పాటు అన్నివర్గాల ప్రజలు 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పైడి ఏసుబాబు, ఎంపీటీసీలు పోతాబత్తుల శ్రీలక్ష్మీదుర్గ, అంబటి సుధాకర్, ఉప సర్పంచ్ అల్లూరి గీతావాణి, గొట్టుముక్కల సురేష్, సచివాలయ కన్వీనర్లు నేలపూడి సురేష్, విప్పర్తి విజయచంద్ర, బొక్కా వెంకటరమణ, పోతాబత్తుల కృష్ణ, పైడి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌కు ఓటెయ్యండి

యలమంచిలి: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. కాజ తూర్పు గ్రామ సచివాలయం వద్ద సోమవారం జరిగిన “వై ఏపీ నీడ్స్ జగన్” కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా గ్రామానికి నాలుగున్నరేళ్లలో లబ్ధి చేకూరిన రూ.15.57 కోట్ల వివరాలతో కూడిన బోర్డులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలంకి శ్రీనివాసరావు, ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇలపకుర్తి లక్ష్మీనరసింహారావు, సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జవదాల సువర్ణ రాజు, నాయకులు పాల్గొన్నారు.

మాముదూరులో..

పెనుమంట్ర: మండలంలోని మాముదూరు గ్రామంలో “ఏపీకి జగనే ఎందుకు కావాలంటే..” కార్యక్రమాన్ని పెనుగొండ ఏఎంసీ చైర్‌పర్సన్ వెలగల వెంకటరమణ ప్రారంభించారు. సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గూడూరి దేవేంద్రుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్లు కొవ్వూరి చిన్నారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీమారుతి, సొసైటీ అధ్యక్షుడు దాట్ల గోపాలకృష్ణంరాజు(చంటిరాజు) పాల్గొన్నారు.

జగనన్నతోనే బంగారు భవిష్యత్

నరసాపురం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బంగారు భవిష్యత్ ఉటుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మొగల్తూరు మండలం సత్రవపాలెంలో సోమవారం “వై ఏపీ నీడ్స్ జగన్” కార్యక్రమంలో భాగంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హత ఉన్న ప్రతి పేదవాడిని గుర్తించి చేయూతనివ్వాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. తొలు పార్టీ జెండాను, గ్రామంలో ఇప్పటి వరకూ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఖర్చు పెట్టిన మొత్తం వివరాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తిరుమాని బాబ్జి, వైస్ ఎంపీపీ కైల సుబ్బారావు, ఎంపీటీసీ దూసనపూడి దొరబాబు, వైస్ ప్రెసిడెంట్ బోణం నరసింహారావు, వక్ఫ్ బోర్డు మెంబర్ షేక్ అమీర్ బాషా, గుబ్బల నారాయణ మూర్తి, మోటుపల్లి రామ భాస్కరరావు, కర్రి ఏసుబాబు, కుక్కల కృష్ణమోహన్ పాల్గొన్నారు.



పాలకొల్లు అర్బన్: లంకలకోడేరులో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న గుడాల గోపి



పోడూరు: గుమ్మలూరులో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పెనుమంట్ర: మాముదూరులో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు



యలమంచిలి: కాజ తూర్పులో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకుడు గుడాల గోపి



నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం సత్రవపాలెం సభలో మాట్లాడుతున్న ముదునూరి

మార్మోగిన శివనామస్మరణ

పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం శివనామస్మరణతో పులకించింది. కార్తీకమాసం తొలి సోమవారం పురస్కరించుకుని మహిళలు వేకువ జాము నుంచే కాలువ స్నానాలు చేసి కార్తీక దీపాలు వదిలి అనంతరం క్షీరారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో క్యూలైన్లు నిండిపోయి బొండాడ కళాక్షేత్రం వరకూ భక్తులు బారులుదీరారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి పంచారామ యాత్రికులతో ఆలయం కిటకిటలాడింది. ద్రాక్షారామం, సామర్లకోట ప్రాంతాల నుండి వచ్చే భక్తులు మధ్యాహ్నం 12 గంటల సమయంలో, అమరావతి, భీమవరం ప్రాంతాల నుండి వచ్చే భక్తులు మధ్యాహ్నం 3 గంటల సమయంలో, పై నాలుగు యాత్రలు చూసుకుని క్షీరారామలింగేశ్వరస్వామిని దర్శించుకునే భక్తులు రాత్రి 8 గంటల సమయంలో రావడంతో రాత్రి



క్షీరారామలింగేశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకస్వాములు

వరకూ క్యూలైన్లు భక్తులతో పోటెత్తాయి. సుమారు 40 వేల మంది వరకూ భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. స్థానిక రేపాక వారి సత్రంలో భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. క్షీరారామలింగేశ్వస్వామి సేవా సమితి సభ్యులు, యునైటెడ్ కాపు క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత పాలు, ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ సమీపంలో వివిధ సేవా సంస్థల సభ్యులు ఆలయానికి వచ్చే యాత్రికుల కోసం ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆచంటేశ్వర ఆలయంలో.. కార్తీక మాసం పూజలు

పెనుగొండ: ప్రసిద్ధి గాంచిన శ్రీ ఆచంటేశ్వర స్వామివారి ఆలయం కార్తీక మాసం తొలి సోమవారం భక్తులతో పోటెత్తింది. శివనామ స్మరణతో మార్మోగింది. భక్తులు తెల్లవారు జాము నుంచే పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పార్వతి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. స్వామివారు విశేష అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పెనుగొండలో..

సిద్ధాంతం కేదారి ఘాట్‌లో వశిష్ట గోదావరిలో భక్తులు కార్తీక దీపాలు వదిలారు. కేదారేశ్వర స్వామి ఆలయం వద్ద తులసి పూజలు నిర్వహించి, స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు చేశారు. నూతనంగా ప్రతిష్ఠించిన శివలింగానికి స్వయంగా అభిషేకాలు భక్తులు చేసి పరవశించిపోయారు. పెనుగొండ నగరేశ్వర స్వామి, వడలి అగస్త్యేశ్వర స్వామి, సిద్ధాంతం కేదారేశ్వర స్వామివార్లకు ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. పెనుగొండ వాసవీ శాంతి ధామ్‌లో ఉదయం నుంచి పూజాలు, రాత్రి దీపాలంకరణ కనుల పండుగగా సాగింది.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

పాలకొల్లు సెంట్రల్: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి అన్నారు. సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆయన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

పంచారామ క్షేత్రం యాత్రికులకు సకల సౌకర్యాలు

వైఎస్సార్ సీపీ నేత గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: పంచారామ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామిని సోమవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకస్వాములు స్వాగతం పలికి, స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించారు. అనంతరం గోపి విలేకరులతో మాట్లాడారు. కార్తీక మాసంలో పంచారామ క్షేత్రాన్ని దర్శించుకునే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం రాపాక వారి సత్రంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారంభించి భక్తులకు ప్రసాదాలు వడ్డించారు. దాత వీనస్ లాడ్జి అధినేత కోయ కల్యాణ్ బలరామ్‌ను గోపి శాలువాతో సత్కరించారు. యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాదం పాలు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణ, ట్రస్టీలు గోపి వెంట ఉన్నారు.

బాలికలపై అరాచకాలను అరికట్టాలి

పెనుగొండ: బాలికలపై జరుగుతున్న అరాచకాలను అరికట్టాలని పెనుగొండ తహసీల్దార్ ఎస్.గురుమూర్తి పిలుపునిచ్చారు. పెనుగొండలోని ఎస్‌వీకేపీ అండ్ ఎస్‌కేవీఆర్ బాలికల హైస్కూలులో సోమవారం మండల స్థాయిలో “బేటీ బచావో.. బేటీ పడావో” కార్యక్రమం నిర్వహించారు. దీనిలో వివిధ శాఖలలో విశిష్ట పదవులలో ఉంటూ సేవలు అందిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ వి.అన్నపూర్ణ, మండల వ్యవసాయాధికారి పి.స్పందన, ఎస్‌టీఓ ఎస్ఎస్‌వీ రామలక్ష్మి, యల్లాప్రగడ నర్సింగ్ హోమ్ డాక్టర్ కె.అన్నపూర్ణలను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. తహసీల్దార్ గురుమూర్తి మాట్లాడుతూ బాలికల్లో ఉన్న ప్రతిభాపాటవాలను వెలికితీసి వారికి మంచి భవిష్యత్తునిచ్చేలా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 డి.శుభాకరరావు, ఎంఈఓ-2 పి.రామకృష్ణ పాల్గొన్నారు.

దళితుల శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

పెనుమంట్ర: ఆలమూరులో దళితుల శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ సోమవారం మాజీ మంత్రి, ఆచంట శాసన సభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు గ్రామ దళిత సంఘాల నాయకులు వినతి పత్రం సమర్పించారు. 2 వేలకు పైగా జనాభా ఉన్న గ్రామంలో దళితుల శ్మశాన వాటికకు స్థలం లేక పూర్వం నుంచి ఓడూరు పంచాయతీ పరిధిలో ఉన్న నక్కలపుంతను శ్మశాన వాటికగా వినియోగించుకుంటున్నామని, అయితే ఇటీవల ఆ గ్రామస్తులు, పంచాయతీ తమ దళితులలో ఎవరైనా చనిపోతే అక్కడ దహన సంస్కారాలు చేయడానికి అభ్యంతరం తెలుపుతున్నారని, ఆ పుంతలో దహన సంస్కారాలు చేయడం వల్ల స్థానిక రైతులకు కూడా కొంత ఇబ్బందికరంగా ఉందని ఎమ్మెల్యేకు వివరించారు. ఆయన సానుకూలంగా స్పందించారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు పెన్మెత్స విశ్వనాథరాజు ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యులు పలివెల ఆశాలత ప్రేమ్‌కుమార్, దళిత నాయకులు కుసుమే వెంకటేశ్వరరావు, మాతా శ్రీను, వసంతాడ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజుకు వినతి పత్రం ఇచ్చిన మహిళలు

ఇళ్ల పట్టాలు ఇప్పించండి

సత్యవరం గ్రామంలో తమకు ఉన్న స్థలాలకు ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు ఉన్నాయని, వాటి స్థానంలో శాశ్వత ఇళ్ల పట్టాలు ఇప్పించాలని గ్రామానికి చెందిన చెరుకువాడ వరలక్ష్మి, పాలకొల్లు సావిత్రి,లు తూర్పుపాలెం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజును కలిసి కోరారు.

విజేతలకు బహుమతులు

పెనుమంట్ర: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం సోమవారం మార్టేరు రోటరీ భవనంలో జరిగింది. వారం రోజుల పాటు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించగా, విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, మానవత చైర్మన్ చిర్ల సూర్యనారాయణరెడ్డి, ఆత్మీయ సహకార చైర్మన్ చిర్ల శ్రీనివాసరెడ్డి, సభ్యులు చిర్ల వంశీరెడ్డి, మార్టేరు సర్పంచ్ మట్టా కుమారి రాము, ఎంపీటీసీ సభ్యులు కర్రి అనురాధ జోగిరెడ్డి, వెలగలేరు సొసైటీ అధ్యక్షుడు అల్లం భాస్కరరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు చదువుల సుబ్రహ్మణ్యం, యోగా టీచర్ పడాల రామచంద్రారెడ్డి, మహిళా కానిస్టేబుల్ కాశీరమణ, గ్రంథాలయాధికారి పీటీ శివకుమార్, అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడిమెట్ల రామారెడ్డి, మానవత వైస్ ప్రెసిడెంట్ కర్రి కృష్టారెడ్డి, మాజీ అధ్యక్షుడు కడలి సుబ్రహ్మణ్యం, మానవత, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక శోభ

నరసాపురం రూరల్: కార్తీక మాసం మొదటి సోమవారం నరసాపురం మండలంలోని శివాలయాలు భక్తజన సందోహంతో పోటెత్తాయి. తెల్లవారు జాము నుంచే పెద్దెత్తున భక్తులు లక్ష్మణేశ్వరం రేవులోని వశిష్ఠ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. రేవు ఆవరణలో దీపాలు వెలిగించి గౌరీ మాతకు పూజలు చేసి గోదావరిలో వదిలారు. అనంతరం స్థానిక దుర్గాలక్ష్మణేశ్వర స్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొనగా, పరపా వెంకట స్వామి కుమారులు ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో దొంగా మురళీకృష్ణ, పరసా శ్రీను, కడలి ఆదినారాయణ, తిరుమాని వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.



అన్నసమారాధనలో వడ్డిస్తున్న ఎమ్మెల్యే ప్రసాదరాజు